పెట్టుబడి జాస్తి .. దిగుబడి నాస్తి

● పప్పుశనగ కోతలు ప్రారంభం ● ఎకరాకు రెండు బస్తాల దిగుబడి ● ఆందోళనలో అన్నదాతలు

పెద్దపప్పూరు: వర్షాధారం కింద సాగుచేసిన పప్పుశనగ పంట దిగుబడి లేక కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపప్పూరు మండలంలోని నరసాపురం, కుమ్మెత, పెండేకల్లు, అత్తిరాలదిన్నె, కమ్మవారిపల్లి, కొట్టాలపల్లి, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో అధికారుల రికార్డు మేరకు 3,200 ఎకరాల్లో రైతన్నలు పప్పుశనగ పంట సాగు చేశారు. గత నెలలో కురిసిన తుపాను వర్షాల కారణంగా పూతమొత్తం రాలిపోవడంతో పంటదిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని అన్నదాతలు వాపోయారు. ఏటా ఖరీఫ్‌లో సాగుచేసే పంటలపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల ఆశలు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. విత్తనాలు, ఎరువులు, మందులు, విత్తు, కూలీలు, నూర్పిడి కోసం ఎకరానికి దాదాపు రూ.15 వేలు పెట్టుబడి పెట్టామని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎకరాకు రెండు బస్తాలకు మించి



పంటకోత కోస్తున్న కూలీలు

దిగుబడి వచ్చే అవకాశం లేదన్నారు. మార్కెట్‌లో పప్పుశగన క్వింటాల్ రూ.6,000 పలుకుతోందన్నారు. నాణ్యత లేకుంటే కేవలం రూ.5,500కే విక్రయిస్తున్నామన్నారు. పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరారు.

నియోజకవర్గంలో పప్పుశనగ సాగు ఇలా..

పెద్దపప్పూరు
3,200 ఎకరాలు

పెద్దవడుగూరు
1,200 ఎకరాలు

యాడికి
2,300 ఎకరాలు

తాడిపత్రి
4,300 ఎకరాలు

పెట్టుబడి కూడా అనుమానమే..



పూతదశలో పంటలు కళకళలాడడంతో ఈ ఏడాది ఆశించిన దిగుబడి వస్తుందని అనుకున్నాం. అప్పుడు తుపాను వర్షాలు కురవడం వల్ల పూత మొత్తం నేలరాలిపోవడంతో ఆశలు నీరిగారిపోయాయి. కనీసం పెట్టుబడైనా వస్తుందా? లేదా అన్న సందేహం ఉంది.
– పెద్ద వీరారెడ్డి, రైతు, పెండేకల్లు

ఎకరాకు రెండు బస్తాలే..



20 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశాను. పంట కోతలు ప్రారంభించాం. ఎకరానికి రెండు బస్తాలకు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదు. ఎరువులు, కూలీలు, మందులకు అయిన ఖర్చు కూడా వచ్చేలాలేదు. భవిష్యత్‌లో వర్షాధారం కింద పంట సాగు చేయాలంటే భయమేస్తోంది.
–నాగలింగేశ్వర్‌రెడ్డి, రైతు పెండేకల్లు

దిగుబడి తగ్గింది



వర్షాల కారణంగా పూత రాలిపోవడంతో పప్పుశనగ దిగుబడి తగ్గినమాట వాస్తమే. మండల వ్యాప్తంగా పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 2 నుంచి 3 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు ఫలితాలు వచ్చాయి. గత ఏడాదితో పోల్చిలే దిగుబడి బాగా తగ్గింది.
– ఆంజనేయులు, ఏఓ, పెద్దపప్పూరు

కేవలం 0.910 కిలోల దిగుబడి



గోపురాజుపల్లిలో పప్పుశనగ పంటకోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు రెవెన్యూ పరిధిలో బుధవారం వ్యవసాయ అధికారి కాత్యాయని ఆధ్వర్యంలో పప్పుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గోపురాజుపల్లిలో రైతు నారాయణరెడ్డి పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగాలు చేపట్టగా 0.910 కిలోల దిగుబడి వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. వాతావరణంలో మార్పుల వల్ల పప్పుశనగ దిగుబడి తగ్గడంతో పెట్టుబడులు చేతికి అందని పరిస్థితి ఏర్పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, వీఏఏ భార్గవి, ఎంపీఈఓ నాగలింగేశ్వర, ఇన్సూరెన్స్ ఏజెంట్ షమీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి చెస్ పోటీల్లో సత్తా



బహుమతి అందుకున్న అరవ విశ్వాణి

గుంతకల్లుటౌన్: జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థిని అరవ విశ్వాణి సత్తాచాటింది. 9 రౌండ్లల్లో 7 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశ్వాణి అద్భుతమైన వ్యూహాల్ని ప్రదర్శించినట్లు పాఠశాల డైరెక్టర్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ డైరెక్టర్ నాగార్జున కర్నాటకం బుధవారం తెలిపారు. బాలికను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నెలాఖరుకు గోకులం షెడ్ల నిర్మాణం పూర్తిచేయాలి

పుట్లూరు: గోకులం షెడ్లు మంజూరైన పాడి రైతులు ఈ నెల 31వ లోపు నిర్మాణాలను పూర్తి చేయాలని ఏపీఓ నరేంద్ర సూచించారు. బుధవారం ఆయన మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు 100 రోజుల పనిదినాలు తప్పక కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ విజయకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

యాడికి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నగరూరు, తూట్రాళ్లపల్లి, కొత్తపల్లి, రామరాజుపల్లి గ్రామాల్లో మండల అధికారులతో కలసి ఎమ్మెల్యే సభలు నిర్వహించారు. తూట్రాళ్లపల్లిలో ఎదురెదురుగా ఉన్న నాగిరెడ్డి, లక్ష్మిరెడ్డి ఇళ్ల వద్ద సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజుకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సచివాలయ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో కళాశాలలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, జేకేసీ కోఆర్డినేటర్ నాగరాజు బుధవారం తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఓలా, స్విఫ్ట్ సపోర్ట్, గ్రో ఎంఎస్‌సీ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో 24వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు హెచ్‌టీటీపీ. నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

స్కూల్ ఆటో బోల్తా



చిత్రచేడు వద్ద ఆటో బోల్తాపడిన దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామం సమీపంలో స్కూల్ ఆటో బోల్తా పడిన సంఘటన చోటు చేసుకొంది. వివరాలు... మండలంలోని చిన్నయక్కలూరు, రెడ్డిపల్లి, చిత్రచేడు సమీప గ్రామాల నుంచి విద్యార్థులను ఆటోలో శింగనమల మండలం తరిమెలలోని ఓ ప్రైవేటు పాఠశాలకు తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం విద్యార్థులను ఆటోలో పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకెళ్తుండగా.. చిత్రచేడు సమీపంలో ఆటో రోడ్డు పక్కకు బోల్తా పడింది. స్థానికులు వెంటనే ఆటోలోని పిల్లలను బయటకు తీశారు. ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోయారు.

దుప్పట్ల పంపిణీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రార్థనా మందిరాల వద్ద తలదాచుకుంటున్న 100 మంది నిరాశ్రయులకు భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మేస్త్రీ దొడ్డప్ప బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, పెద్దయ్య, రాజు, శివ, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీతో ఆదాయం



వంకరాజుకాలువలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

పామిడి: ఆదాయం పెంపొందుకు చెత్త సంపద తయారీ కేంద్రాలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వంకరాజుకాలువ, ఎద్దులపల్లి చెత్త సంపద తయారీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్త సేకరణకు సక్రమంగా చేపట్టాలన్నారు. చెత్త సంపద తయారీతో వచ్చే ఆదాయం పంచాయతీలో అభివృద్ధి పనులు నిర్వర్తించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎంపీడీఓ కే తేజోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, చెత్త సంపద తయారీ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలంలో సీసీ రోడ్డు వేయడాన్ని అడ్డుకుంటాం

పామిడి పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో పంచాయతీ అభివృద్ధి పనుల ముసుగులో అక్రమ భవనాలకు రోడ్డు వేయడాన్ని అడ్డుకుంటామని బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు గద్దల నాగభూషణం అన్నారు. బుధవారం పామిడిలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద డీపీఓను కలసి ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయల విలువ చేసే స్థలంలో అక్రమ భవనాలను తొలగించాల్సింది పోయి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అభివృద్ధి పనులంటూ అక్రమార్కులకు కొమ్ముకాస్తూ సీసీ రోడ్డు నిర్మించాలనుకోవడం సరికాదన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ రెండు సెంట్ల స్థలం కేటాయించడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శ వర్గ సభ్యుడు డీ.జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులుతో కలిసి భారీ ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అర్బన్ ఏరియాల్లో రెండు సెంట్లు, రూరల్ ఏరియాల్లో 3 సెంట్లు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణాలకు రూ.4 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ దిశగా అధికారులు పని చేయడం లేదన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రకటించిన రూ.4 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలన్నారు. అనంతరం లబ్ధిదారుల నుంచి సేకరించిన అర్జీలను మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ, రూరల్ కార్యదర్శులు ఎస్.గోపీనాథ్, రాముడాయల్, నాయకులు ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బాల నేరస్తులను జువైనల్ హోంకు తరలిస్తాం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శివప్రసాద్‌యాదవ్

గుత్తి: బాల నేరస్తులను గుర్తించి జువైనల్ హోంకు తరలిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ శివ ప్రసాద్ యాదవ్ అన్నారు. గుత్తి స్పెషల్ సబ్ జైల్‌ను బుధవారం ఆయన స్థానిక ఏడీజే శ్రీహరితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్ జైలులోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లాక అందరితో కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించాలన్నారు. బాల నేరస్తులను జువైనల్ హోంకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు సిబ్బంది సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోండి



గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లిలో పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: ఉచిత పశు వైద్యశిబిరాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ సూచించారు. మంగళవారం గుడ్డాలపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. అనంతరం శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పశువిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గార్లదిన్నె పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని జూలకాల్వ గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 23 అనారోగ్యంతో ఉన్న పశువులకు వైద్యం అందించారు. అలాగే 97 పెద్ద పశువులు, 52 దూడలకు నట్టల నివారణ మందులను తాపించారు. ఈకార్యక్రమంలో వెటర్నరీ వైద్యుడు కిరణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్నపొలమడలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు, సిబ్బంది కలసి 55 పశువులకు వ్యాధి నిరోధక మందులను పంపిణీ చేశారు. నాలుగు పశువులకు గర్భకోశ నివారణ, ఏడు పశువులకు చూలు పరీక్ష, 17 పశువులు, 37 దూడలు, 1,282 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాగించారు. రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు.

ఘనంగా గ్రామదేవర



పామిడిలో అంకాలమ్మ దేవతను దర్శించుకుంటున్న వీరాంజనేయులు



గుంతకల్లు మండలం కొంగనపల్లిలో వేడుకలకు హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు

గుంతకల్లు రూరల్: మండలంలోని కొంగనపల్లిలో బుధవారం గ్రామ దేవర వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బంధువులు తదితరులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, యువ నాయకుడు భీమిరెడ్డి తదితరులు హాజరై పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి విందు స్వీకరించారు.

పామిడి: పట్టణంలోని కొండూరు రోడ్డులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంకాలమ్మ, కుంటెమ్మ గ్రామదేవతల జాతర బుధవారం ముగిసింది. ఈసందర్భంగా పూజారి నాగన్న ఆధ్వర్యంలో అమ్మవార్లను అలంకరించి విశేష పూజలు చేశారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం రాష్ట్రస్థాయిరాతిదూలెం లాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేశామని సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని వేములపాడులో కొలిమి ఇస్మాయిల్ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం రావటంతో సీఐ బుధవారం దాడి చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.6 వేలు విలువ గల 36 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణ, ఏఎస్ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం, లచ్చానపల్లి రోడ్డులోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ కేంద్రాల్లో అందుతున్న ప్రజా సేవలపై తీశారు. ఆధార్ అప్డేషన్, బర్త్, డెత్ సర్టిఫికెట్లను సకాలంలో పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు.

కసాపురంలో 30న టెండర్లు

గుంతకల్లు రూరల్: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 30న ఆలయంలో నిర్వహించే వివిధ రకాల పనులకు టెండర్లు నిర్వహించనున్నట్లు ఈఓ కే వాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి వచ్చే ఏడాది మార్చి 31 దాకా ఆలయంలో నిర్వహించే 30 రకాల పనులకు ఈ నెల 30న సీల్డు టెండర్, ఆన్‌లైన్ టెండర్‌తోపాటు, బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ టెండర్ బిడ్‌ను ఈనెల 29లోపు డౌన్‌లోడ్ చేసుకుని, అదేరోజు సాయంత్రం 4 గంటల్లోపు టెండర్ దాఖలు చేయాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు టెండర్లలో పాల్గొనవచ్చని ఆమె సూచించారు.

ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని మాసినేని స్కూల్ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొని పామిడికి చెందిన శ్రీధర్ గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

గుంతకల్లు: పట్టణ మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సర క్యాలెండర్లను జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీజే అధ్యక్షుడు డాక్టర్ నజీర్, నాయకులు హాఫీజ్, అల్లాబకాష్, హనుమేష్, సాయి, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు తహసీల్దార్ రమాదేవి క్యాలెండర్లు ఆవిష్కరించారు.

వైద్యుడికి సన్మానం

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యుడు రాఘవేంద్రను బుధవారం కల్లూరు జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు కే కులశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 3న ఫిజిక్స్ టీచర్ కే నాగభూషణం గ్యాస్ట్రిక్ సమస్యకు గురయ్యారు. వెంటనే అతడిని ఉపాధ్యాయులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ రాఘవేంద్ర గుండెనొప్పికి సంబంధించిన ఖరీదైన ఇంజెక్షన్ వేసి ఉపాధ్యాయుడిని అనంతపురానికి రెఫర్ చేశారు. తద్వారా అతడికి ప్రాణాపాయం తప్పించారు. ఇందుకు డాక్టర్ వైఎస్ రాఘవేంద్రరెడ్డి పర్యవేక్షణలోని డాక్టర్లు షర్మిల, కమలాధర్, మనీషా, మహేష్‌కుమార్, హెడ్‌నర్సు శివకుమారి, స్టాఫ్ నర్సులు సుధారాణి, రోహిణికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆసుపత్రి వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి సమక్షంలో డాక్టర్ రాఘవేంద్రను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, ఇన్‌ఛార్జ్ హెచ్ఎం సీ ఆదినారాయణరెడ్డి, కే నాగభూషణం, కే కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లు పునఃప్రారంభించాలి

గుంతకల్లు: కుంభామేళకు తరలించిన ప్యాసింజర్ రైళ్లను వెంటనే పునఃప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు డీఆర్ఎం సీఎస్ గుప్తాకు వినతి పత్రం అందజేశారు. దాదాపు ఆరు ప్యాసింజర్ రైళ్లను రెండు నెలలకు పైగా రద్దు చేయడంతో తిరుమల వెళ్లే భక్తులతోపాటు విద్యార్థులు, వ్యాపారులు, ప్రజలు రాకపోకలు సాగించాడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు మహేంద్ర, రహంతుల్లా, షేక్ ఆలంనవాజ్, ఖాదర్‌వలి, నబిరసూల్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 'అనుబంధ' అధ్యక్షుల నియామకం



తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం విడుదల చేసింది. యూత్ విభాగం అధ్యక్షుడిగా బి. ప్రదీప్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పి. రేవతి, రైతు విభాగం టి. మధనమోహన్‌రెడ్డి, బీసీ సెల్ కె. రవికుమార్, ఎస్సీ సెల్ బి. రాఘవేంద్ర ప్రసాద్, ఎస్టీ సెల్ బి. రామాంజనేయులు, మైనార్టీ సెల్ ఎస్.అన్వర్‌బాషా, క్రిష్టియన్ మైనార్టీ సెల్ డి. సునీల్ కుమార్, విద్యార్థి విభాగం కాశీ మనోజ్, పంచాయతీ రాజ్ వింగ్ పి. యోగేశ్వర రావ్, మున్సిపల్ వింగ్ కె.ఓబుళరెడ్డి, ఆర్టీఐ వింగ్ ఎం.మోహన్‌రెడ్డి, వలంటీర్ల వింగ్ ఆర్. చంద్రఓబుళరెడ్డిని నియమించారు. అలాగే గ్రీవెన్స్ సెల్ టి. శివ ప్రసాద్, వాణిజ్య విభాగం వి.నాగలింగేశ్వరరావు, చేనేతల వింగ్ గడ్డం పరమేష్, వైఎస్సార్‌టీయూసీ బి.రాజేశ్వర రావు, లీగల్ సెల్ కె.ఎస్.ఎస్. ప్రభుకుమార్, కల్చరల్ వింగ్ టి.అమర్‌నాథ్ రెడ్డి, సోషల్ మీడియా వింగ్ సి.బ్రహ్మానందరెడ్డి, ఐటీ వింగ్ పి. వినోద్‌కుమార్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం వి.నాగభూషణ్ రెడ్డి, పబ్లిసిటీ వింగ్ ఎం.హనుమంతరెడ్డి, బూత్ కమిటీ వింగ్ జి. రవితేజారెడ్డి, ఇంటలెక్చువల్స్ ఫోరం వింగ్ అధ్యక్షులుగా సి. నవీన్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు.

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడిగా బి.రామాంజినేయరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎ.పార్వతి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఈ.రమణారెడ్డి, బీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా కె.చిన్నిక్రిష్ణ, ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడిగా జె.యల్లప్ప, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా జి.వెంకటరాముడును నియమించారు. అలాగే మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా కె.జాఫర్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎస్.ప్రసాద్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఎస్.విశ్వనాథ్, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా ఎస్.సంజీవులు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా డి.దామోదర్, వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా ఎం.నవీన్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడిగా పి.లక్ష్మీకళ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా వై.తాతిరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా జె.శేషయ్య, చేనేత విభాగం అధ్యక్షుడిగా కాటమయ్య, వైఎస్సార్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా కె.వెంకటనారాయణరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా కె.వి.రమణరెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా జి.గోవర్ధన్‌రెడ్డి, ఐటీ విభాగం అధ్యక్షుడిగా పి.మహమ్మద్ రఫిక్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కె.భరత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా కె.నాగేంద్ర, ఇంటిలెక్చువల్ ఫోరమ్ విభాగం అధ్యక్షుడిగా బి.పురుషోత్తం, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరెడ్డి, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా పూల రంగనాథ్, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా పి.రామాంజనేయులు నియమితులయ్యారు.

గుంతకల్లు: నియోజకవర్గ అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. గుంతకల్లు అసెంబ్లీ యూత్ వింగ్ అధ్యక్షుడిగా అబ్దుల్‌బాసిద్, మహిళ విభాగం అధ్యక్షురాలిగా బి.వరలక్ష్మీ, రైతు విభాగం అధ్యక్షుడిగాఆర్.నాగేశ్వరరావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రిష్టియన్ సెల్ విభాగం అధ్యక్షులుగా పీ.రంగనాయకులు.ఎస్.వీరేషబాబు, కే.రామాంజినేయులు. సీ.చాంద్‌బాషా, శ్యాముల్ కుమార్,, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నక్క నరప్పను నియమించారు. అలాగే పంచాయతీ, మున్సిపల్ విభాగం కావలి తిక్కస్వామి, కె.లింగన్న, వలంటీర్ వింగ్ బి.పవన్‌కుమార్, గ్రీవెన్స్ వింగ్ మద్దికెర హజీబాబా, వాణజ్య విభాగం షాబుద్దీన్, వివర్స్ వింగ్ జి.శ్రీనివాసులు, వైఎస్సార్‌టీయూసీ విభాగం ఎం.మస్తాన్, అంగన్‌వాడీ విభాగం ఎస్.మేరీ, లీగల్ సెల్ వెంకట్ గోపాల్, కల్చరల్ వింగ్ మట్టం మల్లికార్జున, సోషియల్ మీడియా విభాగం ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, ఐటీ విభాగం ఎ.సూర్యప్రకాష్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం కె.కనకరాజు, డాక్టర్ విభాగం బీ. నాగమల్లరెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరమ్ వింగ్ పాటిల్ యుగంధర్‌రెడ్డి, బూత్ కమిటీ వింగ్ మౌలా, పబ్లిష్ వింగ్ అధ్యక్షుడిగా ఎస్. విష్ణువర్ధన్ నియమితులయ్యారు.

విద్యార్థి అదృశ్యం..వెంటనే ఆచూకీ లభ్యం

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమై వెంటనే ఆచూకీ లభించింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, కవిత కుమారుడు లోకేష్‌రెడ్డి ఓ ప్రైవేట్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే మధ్యాహ్నం ఇంటికి వచ్చిన విద్యార్థి అన్నం తిన్న తరువాత చెయ్యి శుభ్రం చేసుకునేందుకు బయటకు వచ్చాడు. ఎంతసేపటికీ బాలుడు ఇంట్లోకి రాకపోవడంతో అనుమానంతో కవిత ఇంటి పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లు వెతికినా కుమారుడు ఆచూకీ లభ్యం కాలేదు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు పరిసర ప్రాంతాలు పరిశీలిస్తుండగా బాలుడు బాత్‌రూంలోనే ఉన్నట్లు గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.